క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న జేఈ రాఘవేంద్రప్రసాద్

పాములపాడు: సీసీ రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జేఈ రాఘవేంద్రప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు చేపట్టిన 150 మీటర్ల సీసీ రహదారి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు ఇసుక, సిమెంటు, కంకర వినియోగించాలన్నారు. జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్పంచు వరప్రసాదరావు ఉన్నారు.

అంకితభావంతో పని చేయాలి



బదిలీపై వెళ్ళు ఏపీఎం, ఈసీ, టీఏలను సన్మానించిన ఎంపీపీ, ఎంపీడీఓ

పాములపాడు: ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలని ఎంపీపీ సరోజినీ వర్ధినియ అన్నారు. గురువారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఏపీఓ విమలమ్మ, ఈసీ రమేష్‌నాయుడు, టీఏలు రాజేశ్వరరావు, భూషమ్మ, బీఎఫ్‌టీబీ వెంకటమ్మలను ఎంపీడీఓ చంద్రశేఖర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలందించి వారి నుంచి మన్ననలు పొందినప్పుడే నిజమైన సంతృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు వరప్రసాద్ పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు



దత్తాత్రేయ స్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ చేపట్టారు. అనంతరం దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

ఏపీఓ బాధ్యతల స్వీకరణ



రేష్మ

జూపాడుబంగ్లా: ఏపీఓగా రేష్మ, టీఏలు రాములమ్మ, కిరణ్‌కుమార్, కవిత, ఓబులమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఏపీఓ రేష్మ మాట్లాడుతూ లక్ష్యాలను చేరుకునేందుకు క్రమం తప్పకుండా ఉపాధికూలీలకు పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

నేరాలపై అవగాహన

ఆత్మకూరు: మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల స్థానిక చైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లోని విద్యార్థులకు పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. పబ్లిక్ ప్రదేశాల్లో, విద్యా సంస్థల్లో, ఇంటర్నెట్ వాడకంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా మోసాలు గురించి వివరించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

11న మండల సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. సమావేశానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను కార్యాలయ సూపరింటెండెంట్‌కు అందజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

రేపు శ్రీశైలంలో స్వర్ణరథోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం ఈనెల 5న రోజున శ్రీశైల మహా క్షేత్రంలో స్వామి అమ్మవార్లకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు లాగి అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చనున్నట్లు తెలిపారు.



హత్యకు గురైన సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శిల్పా



మృతి చెందిన బారెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో ..

ఆపదలో అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి

బండి ఆత్మకూరు: ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఇటీవల ప్రాణ, ఆస్తి నష్టంతో బాధపడుతున్న మూడు కుటుంబాలను ఆయన గురువారం కలిసి ధైర్యం చెప్పారు. ముందుగా లింగాపురం గ్రామానికి చేరుకుని గత నెల 22న టీడీపీ మద్దతుదారుల చేతిలో హత్యకు గురైన నంద్యాల సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. న్యాయం జరిగే వరకు పోరాడతానని, పూర్తి స్థాయిలో అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అనంతరం ఇదే గ్రామంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బారెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అక్కడి నుంచి సంతజూటూరు గ్రామానికి చేరుకుని ఇటీవల అగ్ని ప్రమాదంలో పొగాకు షెడ్డును కోల్పోయిన రైతు దూదేకుల అజహరుద్దీన్‌ను కలిసి ధైర్యం చెప్పారు. రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. నష్ట పరిహారం అందేలా చూడాలని కోరారు. ఆ తర్వాత ఏ.కోడూరు గ్రామంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. శిల్పా వెంట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, జేసీఎస్ కన్వీనర్ ముడిమేల పుల్లారెడ్డి, లింగాపురం సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు శ్రీనివాస రెడ్డి, అర్జున్, భూమా రవీంద్ర రెడ్డి, సగిలె కృష్ణారెడ్డి, కొంగిసు శివశంకర్, భూమా వెంకట నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంత జూటూరు గ్రామంలో మంటల్లో దగ్ధమైన పొగాకు షెడ్డును పరిశీలిస్తున్న శిల్పా

రసాయన మందులతో భూమి కలుషితం

పాములపాడు: వ్యవసాయంలో రసాయన మందులు ఎక్కువగా వినియోగించడం వల్ల భూమి కలుషితమవుతుందని మండల వ్యవసాయఅధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక మందులు ఎక్కువగా వాడటం వల్ల పండించే ఆహార ధాన్యాలు, కూరగాయలు కలుషితమై మానవాళి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యయసాయానికి సంబంధించిన పలు సూచనలు, సలహాలు ఇస్తూ విత్తన గుళికలను తయారు చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పావతి, ఎస్ఆర్‌పీ నరేంద్ర, ఎస్ఎఫ్ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తయారు చేసిన విత్తన గుళికలు చూపుతున్న స్వయం సహాయక సభ్యులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోవిందరెడ్డి రైతులకు సూచించారు. గురువారం అర్బన్ రైతు సేవా కేంద్రంలో కంది, మినుము, శనగ పంటల కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ ఆంజనేయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కందులకు క్వింటాల్ రూ.7,550, మినుములు రూ.7,400, శనగలు రూ.5,650 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకుని దిగుబడులను విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పి.మల్లికార్జున్ రెడ్డి, మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హరినాథ్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి డి.విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

పగిడ్యాల: ఆలయాలు, మసీదులు, చర్చీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం మండలంలోని లక్ష్మాపురం, పగిడ్యాల, పడమర ప్రాతకోట తదితర గ్రామాల్లో ఆయల కమిటీ సభ్యులు, చర్చి సంఘ పెద్దలు, ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. మత సామరస్యానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా అన్ని మతాలను గౌరవించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఉండదన్నారు. ఆయన వెంట ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

మిడుతూరు ఏపీఓ బదిలీ

నందికొట్కూరు: ఉపాధి హామీ పథకం మిడుతూరు ఏపీఓ జయంతి గురువారం సంజామల మండలానికి బదిలీ అయ్యారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు అలీఖాన్ పాములపాడుకు, నాగయ్య నందికొట్కూరుకు, రాములమ్మ జూపాడుబంగ్లాకు, సాంబశివుడు గడివేముల మండలాలకు బదిలీపై వెళ్లారు. కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీరాములు పగిడ్యాల, ఉషారాణి జూపాడుబంగ్లా మండలాలకు బదిలీ అయ్యారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ఆత్మకూరు: అర్హులైన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఈఆర్‌ఓ రాంభూపాల్‌రెడ్డి సూచించారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరితో ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ గోపికృష్ణ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గురువారం ఆయన జూపాడు బంగ్లా-2 సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించారు. బయటకు వెళ్లేటప్పుడు మూవ్‌మెంట్ రిజిష్టర్‌లో ఎంటర్ చేయాలన్నారు. అనంతరం సర్పంచ్ మొట్టె లయ్య, పంచాయతీ కార్యదర్శి తిప్పన్నలతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించి పలువురికి నీటిని పంపిణీ చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓలు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ప్రత్యే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం కొత్తపల్లి, ఎర్రమఠం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించగా 21 మంది ఈ సేవలను వినియోగించుకున్నార న్నారు. శుక్రవారం గువ్వలకుంట్ల, ఎర్రమఠం గ్రామాల్లో, శనివారం ఎదురుపాడు, ముసలిమడుగు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం

నందికొట్కూరు: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలను టార్గెట్ చేసుకుని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఏకపక్షంగా ఆమోదించడం తగదన్నారు. ప్రతిపక్షం సభ్యులు అసమ్మతి నోట్ పంపినా జాయింట్ పార్లమెంటరీ కమిటీ బిల్లును ఆమోదించి చట్టం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బీబీ, లక్ష్మీదేవి, ఏసన్న పాల్గొన్నారు.



శ్రీశైలంలో జలమయమైన రోడ్లు

శ్రీశైలంలో భారీ వర్షం

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో గురువారం మధ్యాహ్నం గంట పాటు ఏకధాటిగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏటా ఉగాది ఉత్సవాలు ముగిసిన తర్వాత వారం వ్యవధిలో భారీ వర్షం కురుస్తుందని భక్తుల నమ్మకం. ఈ సారి గత నెల 30న ఉగాది ఉత్సవాలు ముగిశాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే భారీ వర్షం కురవడంతో భక్తుల హర్షం వ్యక్తం చేయడంతోపాటు శ్రీశైలం చల్లబడింది.

గుడిసె దగ్ధం

మహానంది: గాజులపల్లె గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి కొట్టాలలో గురువారం రాత్రి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మౌలాలికి చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎగిసి పడటంతో మౌలాలి, కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. బంగారు నగలు, కొంత నగదు, సామగ్రి కాలిపోయిందని బాధితులు పేర్కొన్నారు.



తగలబడుతున్న గుడిసె

10న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. గురువారం కళాశాలలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్-2025 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలో 14 ప్రముఖ కంపెనీలు 500కు పైగా పోస్టుల భర్తీ కోసం పాల్గొంటున్నాయన్నారు. జిల్లాలోని నోడల్ రీసోర్స్ సెంటర్ పరిధిలో ఉన్న పాణ్యం, ఎర్రగుంట్ల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9703377803 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అటవీ చెక్‌పోస్టుల సమయాన్ని పెంచండి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజల అవసరార్థం సున్నిపెంట, దోర్నాల చెక్‌పోస్టుల సమయాన్ని పెంచాలని గురువారం తాడేపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో పీసీసీఎఫ్ ఏకే నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ఇండియా కార్మిక సంఘం నాయకులు వై ఆశీర్వాదం తెలిపారు. తెల్లవారు జామున 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని పీసీసీఎఫ్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే దోర్నాల-ఆత్మకూరు, దోర్నాల-శ్రీశైలం రోడ్ల విస్తరణకు అనుమతులు ఇవ్వాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆశీర్వాదం తెలిపారు.



పీసీసీఎఫ్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు వై.ఆశీర్వాదం

మహానందీశ్వరుడిని దర్శించుకున్న ఐపీఎస్



ఐపీఎస్ జీఎస్ రావు, న్యాయమూర్తి పట్టాభిరామ్

మహానంది: మహానందీశ్వర సన్నిధిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐపీఎస్ జీఎస్ రావు, జిల్లా న్యాయమూర్తి పట్టాభిరామ్ గురువారం పూజలు నిర్వహించారు. కామేశ్వరిదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

సారా.. సారమ్మ.. సారా!

- పల్లెల్లో ఏరులై పారుతున్న నాటు సారా
- ఆదాయ వనరులుగా మార్చుకున్న పచ్చ తమ్ముళ్లు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

నాటు ఘాటు గుప్పుమంటోంది. ఏ పల్లెకు వెళ్లినా సారా ఏరులై పారుతోంది. కూటమి ప్రభుత్వంలో మంచినీళ్లకన్నా మద్యమే సులభంగా దొరుకుతోంది. మరోపక్క తాగుడుకు బానిసలైన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి వీధిన పడుతున్నాయి. అయినా కాసులకు కక్కుర్తి పడిన కూటమి నేతలు మద్యం వ్యాపారాన్నే ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటుండగా ఎక్సైజ్ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు.

నందికొట్కూరు: నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లకు నాటు సారా వ్యాపారం వనరులుగా మారాయి. పలు గ్రామాల్లో నాటు సారా విక్రయాలు ఊపందుకునట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. సాయంత్రమైతే పల్లెలకు నాటు సారా తరలించి పచ్చ తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. అమ్మకం దారులు తక్కువ ధరలకే ప్యాకెట్లు ఇస్తామని ప్రచారం చేసుకుంటుండటంతో మందు బాబులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి తమ వ్యాపారాన్ని మూడు సారా ప్యాకెట్లు.. ఆరు పచ్చ నోట్లుగా విస్తరింపజేసుకుంటున్నారు.

14 ఏళ్ల వయస్సు పిల్లల నుంచి వృద్ధుల వరకు మద్య తాగి బానిసలుగా మారుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ మద్య బాబులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఇటీవల అక్కడక్కడా చోటుచేసుకున్నాయి. గుడి, బడి అనే తారతమ్యం లేకుండా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి నాటు సారా తయారు, విక్రయాలను అరికట్టాలని మహిళలు కోరుతున్నారు.



కోళ్లబావాపురం అటవీ సమీపంలో నాటు సారాయిని ధ్వంసం ఎక్సైజ్ శాఖ అధికారులు



అటవీలో నాటు సారా తయారు చేస్తున్న దృశ్యం

నాటు సారాను అరికట్టాలి



మద్యం మహమ్మారిని తరిమికొట్టేందుకు నాటు సారా స్థావరాలపై నిత్యం అధికారులు దాడులు చేయాలి. తయారీదారులపై ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే పేదలు మద్యం జోలికి వెళ్లరు. లేకపోతే కుటుంబాలు రోడ్డున పడటం ఖాయం. – బీబీ, సీపీఐ(ఎంఎల్) నాయకురాలు, నందికొట్కూరు

పట్టించుకోని అధికారులు



మద్యం ఏరులై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తాగుడుకు బానిసలైన కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మద్యం విక్రయించే వారిని చట్ట పరంగా శిక్షించాలి. అధికారులు మామూళ్లకు పాల్పడకుండా నిత్యం సోదాలు నిర్వహిస్తూ నాటు రాసా బట్టీలు లేకుండా చూడాలి. – లక్ష్మీదేవి, సీపీఐ(ఎంఎల్), నందికొట్కూరు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధులలో నిత్య కళావేదికపై కరీంనగర్‌కు చెందిన ఎం.వెన్నెల బృందం భక్తి సంగీతం కార్యక్రమం నిర్వహించారు. వినాయక కౌత్వం, లింగాష్టకం, శివాష్టకం, జతిస్వరం, శివ తాండవం తదితర గీతాలకు విజయలక్ష్మి సుమాంజలి, కుమారి, మధుశ్రీ తదితరులు భక్తి గీతాలను ఆలపించారు. అలాగే నంద్యాలకు చెందిన కె.సాయికుమార్ బృందం మహాగణపతి, నమో నమో నటరాజ, శివాష్టకం, శ్రీశైల గిరిజ విభో తదితర గీతాలకు నృత్యప్రదర్శన చేశారు.

పరిశుభ్రత పాటిస్తేనే వ్యాధులు దూరం

కొత్తపల్లి: పరిశుభ్రత పాటిస్తేనే వ్యాధులు దూరమవుతాయని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ కె.లక్ష్మణ్ నాయక్ సూచించారు. గురువారం మండలంలో కొత్తపల్లి, గోకవరం, ఎర్రమటం గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. వైద్యశాలల్లోని రికార్డులను తనిఖీ చేశారు. సీజీవ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలలని వైద్యాధికారులకు సూచించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఎండ దెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, టెంకాయ నీళ్ల తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. తనిఖీల్లో వైద్యాధికారులు జబ్బీర్, హకీమ్ రషీద్, మహమ్మద్ బేగ్ పాల్గొన్నారు.



కొత్తపల్లి వైద్యశాలను తనిఖీ చేస్తున్న మలేరియా జోనల్ అధికారి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158

Office mail : sakshiknladvt@gmail.com